TGTEL/25/A0827
ప్రజా దివాస్
తెలుగు దినపత్రిక

విలేఖరులు కావలెను
అసలైన అక్షర జ్ఞానాన్ని వెలియజేస్తూ... విలువలతో కూడిన జీవన శైలితో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ... ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా..? బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా...? అయితే రండి... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..
సెల్ : 9440060406
నియోజకవర్గ ఇంచార్జ్‌లు, జిల్లా స్టాఫర్‌లు మండల రిపోర్టల్‌లు కావలెను...

సంపుటి : 1 సంచిక :104 prajadivvs57@gmail. com శనివారం, ఫిబ్రవరి-7 , 2026 ఎడిటర్: ఎస్ ఎన్ డి మౌనిక రవికుమార్ పేజీలు : 4 వెల : 3/-

# భూ భద్రతకు రాజముద్ర



## కలుగొట్లలో 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో చంద్రబాబు

**ట్యాంపరింగ్ చేయకుండా రికార్డులన్నీ భద్రం**

**క్యూ ఆర్ కోడ్‌తో వివరాలు చూసుకునే వీలు**

**లంచాల వ్యవస్థకు చరమగీతం పాడేలా భూ హక్కు పత్రాలు**

**ఎవరు ట్యాంపర్ చేసినా జైలుకు పంపిస్తాం**



భూమిపై ఇతరులెవరూ కన్నేయకుండా ప్రజలకు సర్వహక్కులు కల్పించామని సీఎం చంద్రబాబు తెలిపారు. గతంలో భూ సమస్యల ఫిర్యాదులు ఇబ్బడిముబ్బడిగా వచ్చాయి. ఇప్పుడు భూమిని ఇతరుల పేరుపైకి మారిస్తే వెంటనే తెలుస్తుంది. క్యూఆర్ కోడ్‌తో మీ ఫోన్‌లోనే మీరు చూసుకోవచ్చు. మీ రికార్డులన్నీ కంప్యూటర్‌లో భద్రంగా ఉంటాయి. భూ వివాదాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టాం అని చంద్రబాబు అన్నారు.మిగతాది 2లో...

# తప్పులను ఎత్తి చూపితే దాడులా ?

**ప్రణాళికతో పోలీసుల సమక్షంలో జోగి ఇంటిపై దాడి**

**ఇల్లు తగులబడితే ఇంట్లో వారి పరిస్తితి ఏమిటి**

**వచ్చేది మా ప్రభుత్వమే..అందరి లెక్కలు తేలుస్తా**

**జోగి రమేశ్ కుటుంబానికి జగన్ పరామర్శ**

**కూటమి ప్రభుత్వ తీరుపై పోరాడుతామని వెల్లడి**




ప్రభుత్వం చేస్తున్న తప్పులను ఎత్తి చూపితే.. ప్రశ్నిస్తే దాడులు చేస్తారా?.. తగలబెడతారా..? అంటూ వైసిపి అధినేత, మాజీ సిఎం జగన్ ఫెర్ అయ్యారు.. జోగి రమేష్ ఇల్లు మొత్తం చిన్నాభిన్నం అయ్యింది.. పక్కనే ఉన్న కరెంట్ ప్లగ్స్ అంటుకుని ఉంటే ఇంట్లో ఉన్న వాళ్ళ నాన్న పరిస్థితి ఏంటని ప్రశ్నించారు.. బీసీ నాయకుడి వాయిస్ అణగదొక్కాలని ఇలా చేయటం న్యాయమా..? అని ఆవేదన వ్యక్తం చేశారు.. రమేష్ ఇంటిపై 5 గంటలకు దాడి జరిగితే పోలీసులు, టీడీపీ నేతలు పథక రచన చేశారు.. పోలీసులు, టీడీపీ నేతలతో కలసి ప్లాన్ చేసి దాడి చేశారని విమర్శించారు.. మాజీ మంత్రి జోగి రమేష్ ఇంటికి వెళ్లి.. దాడి జరిగిన ఆ ఇంటిని పరిశీలించిన వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్.. ఆ కుటుంబాన్ని పరామర్శించారు.. దాడి జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు.. వారికి ధైర్యాన్ని చెప్పారు.. ఆ తర్వాత మీడియాతో మిగతాది 2లో...

# స్తంభించిన పార్లమెంట్

## లోక్‌సభలో స్పీకర్ తీరుపై ప్రతిపక్షాల ఆగ్రహం

**ఉభయ సభల్లో అంతరాయం..**

**సోమవారానికి వాయిదా**




న్యూఢిల్లీ
మోడీ ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలను వ్యతిరేకిస్తూ ప్రతిపక్షాలు చేపట్టిన ఆందోళనతో పార్లమెంట్ శు క్రవారం స్తంభించింది. ఉభయ సభల్లో వరుసగా ఐదో రోజు అంతరాయం కలిగింది. 2లో...

# రుణ గ్రహీతలకు ఊరట..

## కీలక వడ్డీ రేట్లు యథాతథం



**రెపో రేటును యథాతథంగా ఉంచిన ఆర్బీఐ**

**5.25 శాతంగా కొనసాగనున్న వడ్డీ రేటు**

**ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్న ద్రవ్య పరపతి కమిటీ**

**ద్రవ్యోల్బణం అదుపులోనే ఉందని వెల్లడి**

**'న్యూట్రల్' విధానానికే కట్టుబడిన రిజర్వ్ బ్యాంక్**

# టీం 11... కల్తీకి, హత్యలకు బ్రాండ్ అంబాసిడర్లు



**బూత్ మేనేజ్‌మెంట్ వర్క్‌షాప్‌లో నారా లోకేశ్**


**బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని కార్యకర్తలకు పిలుపు**

**విశాఖ ఉక్కును లాభాల్లోకి తెచ్చింది కూటమి ప్రభుత్వమేనని స్పష్టీకరణ**

**దేశ పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకి వస్తున్నాయని వెల్లడి**

'టీం 11' బృందం కల్తీ మద్యం, కల్తీ నెయ్యి, బాబాయి హత్యకు బ్రాండ్ అంబాసిడర్లుగా మారిందని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో విమర్శించారు. దేవుడిని అడ్డం పెట్టుకుని రూ.250 కోట్లు దోచుకుని, ఇప్పుడు కల్తీ నెయ్యి కేసులో క్లీన్‌చిట్ వచ్చిందంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.మిగతాది 2లో...

# పార్టీ ఫిరాయింపులపై స్పీకర్‌కు డెడ్‌లైన్



**మరో మూడు వారాల సమయం**

**అప్పటికీ నిర్ణయం తీసుకోకపోతే కోర్టు ధిక్కార చర్యలపై ఆలోచిస్తాం**

**స్పష్టం చేసిన సర్వోన్నత న్యాయస్థానం**

పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేల అంశంలో నిర్ణయం తీసుకునేందుకు సుప్రీంకోర్టు స్పీకర్‌కు మరో మూడు వారాల సమయం ఇచ్చింది. అప్పటికీ నిర్ణయం తీసుకోకపోతే కోర్టు ధిక్కార చర్యలపై ఆలోచన చేస్తామని హెచ్చరించింది. బీఆర్ఎస్ బీ ఫారం నుంచి కారు గుర్తుపై గెలిచిన శాసన సభ్యులు దానం నాగేందర్, తెల్లం వెంకట్రావ్, కడియం శ్రీహరి


# విశ్వవిజేత భారత్...

## అండర్19 క్రికెట్‌వరల్డ్ కప్ ఫైనల్లో ఇంగ్లండ్‌పై గ్రాండ్ విక్టరీ

**కేవలం 80 బంతుల్లో 175 పరుగులతో విధ్వంసం సృష్టించిన వైభవ్ సూర్యవంశీ**

**భారీ లక్ష్యఛేదనలో ఫల్కనర్ (115) సెంచరీతో ఒంటరి పోరాటం చేసినా ఇంగ్లండ్‌కు తప్పని ఓటమి**

**టోర్నీ ఆద్యంతం అద్భుత ప్రదర్శనతో అపజయం ఎరుగకుండా టైటిల్ నెగ్గిన టీమిండియా**



అండర్-19 క్రికెట్‌లో భారత యువ జట్టు మరోసారి తన ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. హరారే వేదికగా జరిగిన ప్రపంచకప్ ఫైనల్లో ఇంగ్లండ్‌పై 100 పరుగుల భారీ తేడాతో ఘనవిజయం సాధించింది. తద్వారా రికార్డుస్థాయిలో ఆరోసారి అండర్-19 ప్రపంచకప్‌ను ముద్దాడి చరిత్ర సృష్టించిందిమిగతాది 2లో...

# మనకెందుకులే అనుకోవద్దు...

## ప్రతి భక్తుడిపై ధార్మిక బాధ్యత ఉంటుంది: పవన్ కల్యాణ్



**హిందూ ధర్మంపై దాడులు జరిగినప్పుడు మౌనం వీడాలని పవన్ పిలుపు**

**కేవలం భక్తులుగా కాకుండా ధర్మ సంరక్షకులుగా ఉండాలన్న డిప్యూటీ సీఎం**

**కులం, ప్రాంతం వేరైనా మన ధర్మం ఒక్కటేనని వ్యాఖ్య**

**మన విశ్వాసాలను కాపాడుకోవడమంటే ఇతర మతాలకు వ్యతిరేకం కాదని స్పష్టీకరణ**

# భూ భద్రతకు రాజముద్ర

(మొదటి పేజి తరువాయి)

కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం కలుగొట్లలో 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడారు. లంచాల వ్యవస్థకు స్వస్తి చెప్పాలనే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. రాజముద్రతో పట్టాదారు పాస్‌బుక్‌లు ఇస్తున్నాం. వీటిని ఎవరైనా ట్యాంపర్ చేస్తే నేరుగా జైలుకే పంపిస్తాం. అలాంటి వారిని వదిలిపెట్టేది లేదు.

జీవితంలో ఎవరూ మీ భూమి మీద కన్ను వేయకుండా రక్షణ కల్పిస్తున్నట్లు ఏపీ ప్రజలకు సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. తాను నాలుగో సారి ముఖ్యమంత్రిని అయ్యానని.. ఇప్పటి వరకు తన జీవితంలో ఇన్ని భూ సమస్యలు గతంలో ఎప్పుడూ చూడలేదని తెలిపారు. దేశానికి అన్నం పెట్టే రైతు కరోనా సమయంలో సైతం పని చేశారని గుర్తు చేశారు. ఏపీలో ప్రతి ఎకరాకు నీరు ఇవ్వాలన్నది తన సంకల్పమని స్పష్టం చేశారు. టెక్నాలజీకి అనుగుణంగా మార్చుకుంటూ వెళ్లాల్సి ఉందన్నారు. సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేశామన్నారు చంద్రబాబు. రాజధాని అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్ట్, పరిశ్రమలతో రాష్ట్రాభివృద్ధి పరుగులు పెడుతోందని పేర్కొన్నారు. ఓర్వకల్లును తాను అభివృద్ధి చేస్తే.. వాళ్లు సర్వనాశనం చేశారన్నారు. అయినా.. మీ వారసత్వ భూమిపై వైఎస్ జగన్ ఫొటో ఏమిటని రైతులను ఆయన సూటిగా ప్రశ్నించారు. అందుకే రాజముద్రతో కొత్త పుస్తకాలు ఇచ్చి.. మీకు మళ్లీ హక్కు కల్పించానని వివరించారు.

మీ జుట్టు జగన్ తన చేతుల్లో పెట్టుకుని పాలించాడని విమర్శించారు. పిల్లలు స్కూల్‌కి వెళ్లితే.. ఆయన ఫొటో చూడాలి.. పొలానికి వెళ్లితే ఆయన ఫొటో చూడాలనే విధంగా వైఎస్ జగన్ ఏర్పాటు చేశారన్నారు. ఈ దుర్మార్గుడి ఫొటో చూడాల్సిన పని ప్రజలకు ఏముందని ఆయన ప్రశ్నించారు. నూటికి 80 శాతం భూ సమస్యలు వస్తున్నాయని విమర్శించారు. లక్ష ఎకరాల ప్రైవేట్ భూములను ప్రభుత్వ భూముల రికార్డుల్లో పెట్టారని మండిపడ్డారు. తాడేపల్లె సమీపంలో 10 ఎకరాల ప్రైవేట్ భూమిని హెలిప్యాడ్‌గా మార్చుకున్నారంటూ వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ ఆగడాలను ఈ సందర్భంగా ఎండగట్టారు. 70 ఏళ్ల రికార్డున్న ఆ భూమిని ప్రభుత్వ భూమిగా రికార్డులు మార్చారని తెలిపారు. రాజకీయ లబ్ది, వ్యక్తిగత ప్రయోజనాల కోసం అక్రమాలు, దుర్మార్గాలు చేశారని వైసీపీ అగ్రనేతల ఆగడాలను సీఎం చంద్రబాబు బహిర్గతం చేశారు.ప్రజల ఆస్తులకు భద్రత కల్పిస్తున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఎవరైనా మీ భూమిపై కన్నేస్తే జైలుకి వెళ్తారని స్పష్టం చేశారు. ఏ ఒక్క తప్పు ఉన్నా ఆ పట్టాదారు పుస్తకం చించేసి.. సరి చేసి ఇంకో పుస్తకం ఇస్తామని వివరించారు. లంచాల వ్యవస్థకు స్వస్తి చెప్పాలని ఉద్దేశ్యంతో ఈ విధానాన్ని తీసుకుని వచ్చామన్నారు. మీకు కాల్ చేసి.. వివరాలు తీసుకుని మార్పులు చేస్తున్నామని తెలిపారు. 91 వేల మంది రైతులకు పుస్తకాలు ఇస్తున్నామన్నారు. ఏపీని భూ వివాదాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దుతానని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. అర సెంట్ స్థలం కోసం కుటుంబంలో తగాదాలు వస్తున్నాయని చెప్పారు. రతనాల సీమ అయిన రాయలసీమ రాళ్ళ సీమగా మారిందని.. అందుకే అన్న ఎన్టీఆర్ ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలని సంకల్పించారని వివరించారు. రాయలసీమకు నీరు ఇచ్చిన తర్వాతే.. చెన్నైకి ఎన్టీఆర్ నీరు అందించిన విషయాన్ని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. హంద్రీనీవా, తెలుగు గంగా, గాలేరు - నగరి ప్రాజెక్టులు అన్న ఎన్టీఆర్ ఇచ్చారన్నారు. అనంతపురంను ఉద్యానవనంగా మారుస్తున్నామని చెప్పారు. రాయలసీమలో ప్రస్తుతం అత్యధికంగా పంటలు పండించేలా నీరు ఇచ్చామన్నారు. భవిష్యత్‌లో సైతం కరెంట్ ఛార్జీలు పెంచమని చెప్పారు. తాను సీమ బిడ్డనేనని.. అన్న ఎన్టీఆర్ సైతం సీమ బిడ్డేనన్నారు. వైఎస్ జగన్ ఇప్పుడు వచ్చి రాయలసీమ అంటున్నారని పేర్కొన్నారు. రాయలసీమను అభివృద్ధి చేసింది తెలుగుదేశం పార్టీ అని గుర్తు చేశారు. పోలవరానికి శనీశ్వరుడిలా అడ్డు తగిలారంటూ జగన్‌పై నిప్పులు చెరిగారు. గోదావరి పట్టిసీమ పెట్టి.. కృష్ణా డెల్టాకు ఇచ్చే100 టీఎంసీల నీరు రాయలసీమకు మళ్లించి ఆ ప్రాంతంలో కరువును తొలగించామన్నారు.

కరువు జిల్లాల్లో కియా కార్లు పరుగెత్తాయని సీఎం



చంద్రబాబు తెలిపారు. అలా సీమను అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. ప్రపంచానికి రాయలసీమ హార్టికల్చర్ అవుతుందని అభివర్ణించారు. నగదు కోసం.. కమీషన్‌లకు కక్కుర్తి పడి ఎన్‌జీటీ అనుమతి లేని ప్రాజెక్ట్ తెచ్చి.. తనపై బురద జల్లాలని చూశారంటూ వైసీపీ నేతలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తుంగభద్ర (టీబీ) డ్యాం నీళ్లు కర్నూలు జిల్లా ప్రజలు ఎక్కువగా వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్డీఎస్ పూర్తి చేసి.. గుండ్రేవుల కోసం పక్క రాష్ట్రాలతో మాట్లాడి ఒప్పించి నిర్మిస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. వేదవతి ప్రాజెక్ట్ తానే ప్రారంభించి.. పూర్తి చేస్తానని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్ చుట్టూ తీవ్రవాదులు ఉండే సమయంలో.. ఆ నగరాన్ని తాను అభివృద్ధి చేశానని గుర్తు చేశారు. వారికి తాను అడ్డు తగులుతున్నానని తిరుపతిలో తనపై దాడికి దిగారని.. కానీ ఆ వెంకటేశ్వర స్వామి తనను కాపాడారన్నారు. బల ప్రదర్శన అనేది ఎన్నికలలో చూపించుకోవాలని.. మిగతా సమయంలో ప్రజా సేవ చేయాలన్నారు.



# పార్టీ ఫిరాయింపులపై స్పీకర్‌కు డెడ్‌లైన్

పార్టీ ఫిరాయించారని పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద్ సుప్రీంకోర్టులో గతేడాది జనవరి 15న స్పెషల్ లీవ్ పిటిషన్(సివిల్) దాఖలు చేశారు. అదేరోజు ఎమ్మెల్యేలు పరిగి శ్రీనివాస్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, కాలే యాదయ్య, టీ ప్రకాశ్ గౌడ్, అరికెపూడి గాంధీ, గూడెం మహిపాల్ రెడ్డి, ఎం సంజయ్ కుమార్ పార్టీలు ఫిరాయించారని కేటీఆర్, పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద్, జగదీశ్ రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, చింత ప్రభాకర్, కల్వకుంట్ల సంజయ్ సుప్రీంలో రిట్ పిటిషన్(సివిల్) వేశారు.ఆ తర్వాత వాదనలు జరుగుతుండగానే మార్చి 18న బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి స్పెషల్ లీవ్ పిటిషన్(సివిల్) దాఖలు చేశారు. దానం నాగేందర్‌ని ప్రతివాదిగా చేర్చారు. ఈ అన్నీ పిటిషన్లపై గతంలో సీజేఐ ధర్మాసనం విచారణ జరిపి గత జులై 31 వరకు ఫిరాయింపులపై చర్యలు తీసుకోవాలని స్పీకర్ కార్యాలయాన్ని ఆదేశించారు. అయితేడ స్పీకర్ కార్యాలయం ఈ మూడు నెలల కాలం ముగించే సమయానికి.. మరింత గడువు కావాలని సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఇదే సందర్భంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై కోర్టు ధిక్కార పిటిషన్‌తో పాటు, మరో పిటిషన్ దాఖలు చేశారు. అలాగే పాడి కౌశిక్ రెడ్డి, ఇతరులు మిస్ లీనియస్ అప్లికేషన్లు వేశారు. ఈ పిటిషన్లపై శుక్రవారం జస్టిస్ సంజయ్ కరోల్ నేతృత్వంలోని జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్ ద్విసభ్య ధర్మాసనం మరోసారి విచారణ జరిపింది. స్పీకర్ కార్యాలయం తరపు సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ, పిటిషనర్లు కేటీఆర్, పాడి కౌశిక్ రెడ్డి, ఇతరుల తరపున ఏఓఆర్ మోహిత్ రావు హాజరయ్యారు.తొలుత స్పీకర్ తరపున సింఘ్వీ వాదనలు వినిపిస్తూ.. మొత్తం పది అనర్హత పిటిషన్లలో ఎనిమిదింటిని స్పీకర్ పరిష్కరించారని కోర్టుకు నివేదించారు. గత విచారణ తరువాత జరిగిన పురోగతిని ధర్మాసనానికి నివేదించారు. ప్రస్తుతం మున్సిపల్ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఎమ్మెల్యేలు కొంత సమయం అడిగారని తెలిపారు. అందువల్ల మిగిలిన రెండు పిటిషన్ల పరిష్కారానికి మరో మూడు వారాల సమయం కావాలని కోరారు. మార్చి నెల మధ్యలోగా మిగిలిన వాటిపై స్పీకర్ నిర్ణయం తీసుకుంటారని కోర్టుకు వివరించారు.స్పీకర్ తరపు అభ్యర్థనపై పిటిషనర్ల తరపు న్యాయవాది మోహిత్ రావు అభ్యంతరం తెలిపారు. ఇప్పటికే చాలా ఆలస్యం జరిగిందని కోర్టుకు దృష్టికి తీసుకెళ్లారు. దాదాపు 16 నెలలుగా ఈ కేసు నడుస్తోందని, ఉద్దేశపూర్వకంగానే విచారణలో తీవ్ర జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. 'ఒక ఎమ్మెల్యే గెలిచిన ఆరు నెలలకే పార్టీ ఫిరాయించి, కాంగ్రెస్ గుర్తుపై ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. పార్టీ ఫిరాయించిన మరో ఎమ్మెల్యే కుమార్తె కాంగ్రెస్ నుంచి ఎంపీగా పోటీ చేస్తే సంబంధిత ఎమ్మెల్యే ప్రచారం చేశారని ఉద్వేగంగా వాదనలు వినిపించారు. వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకునేలా చూడాలని ధర్మాసనాన్ని అభ్యర్థించారు.ఈ వాదనలపై స్పందించిన ధర్మాసనం, గత ఆదేశాల ప్రకారం కేసులో పురోగతిని స్పీకర్ కార్యాలయం తెలిపిందన్నారు. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని మరో మూడు వారాలు సమయం ఇస్తున్నట్టు జస్టిస్ సంజయ్ కరోల్ వెల్లడించారు. అప్పటికీ స్పీకర్ కార్యాలయం నిర్ణయం తీసుకోకపోతే, కోర్టు ధిక్కరణ చర్యలపై ఆలోచన చేస్తామని ధర్మాసనం పేర్కొంది. మరోవైపు కోర్టులో జరిగిన వాదనలను సోషల్ మీడియాలో పలువురు న్యాయ వాదులు, ఇతరులు వైరల్ చేస్తోన్న అంశంపై ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటివి చేయొద్దని వ్యాఖ్యానించింది.

# విశ్వవిజేత భారత్...

(మొదటి పేజి తరువాయి)

తొలుత బ్యాటింగ్‌లో పరుగుల సునామీ సృష్టించి, ఆపై బౌలింగ్‌లో అద్భుతంగా రాణించి ఇంగ్లండ్‌ను ఆలౌట్ చేసింది.భారత్ నిర్దేశించిన 412 పరుగుల భారీ లక్ష్యఛేదనలో ఇంగ్లండ్ ఆరంభం నుంచే దూకుడుగా ఆడింది. బెన్ డాకిన్స్ (66), బెన్ మేయస్ (45) వేగంగా పరుగులు సాధించారు. అయితే, భారత బౌలర్లు కీలక సమయాల్లో వికెట్లు తీసి ఇంగ్లండ్‌ను దెబ్బకొట్టారు. ఒక దశలో 177 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి ఓటమి అంచున నిలిచింది. ఈ సమయంలో కాలెబ్ ఫల్కనర్ (67 బంతుల్లో 115) ఆకాశమే హద్దుగా చెలరేగాడు. 9 ఫోర్లు, 7 సిక్సర్లతో అద్భుత శతకం బాది ఒంటరి పోరాటం చేశాడు. అతనికి జేమ్స్ మింటో (28) నుంచి కొంత సహకారం లభించినా, అది గెలుపునకు సరిపోలేదు. భారత బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు తీయడంతో ఇంగ్లండ్ పోరాటం 40.2 ఓవర్లలో 311 పరుగుల వద్ద ముగిసింది. భారత బౌలర్లలో ఆర్ఎస్ అంబ్రీష్ 3 వికెట్లతో సత్తా చాటగా, కనిష్క్ చౌహాన్, దీపేష్ దేవేంద్రన్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు.అంతకుముందు, టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత జట్టుకు ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర ఆరంభాన్ని ఇచ్చాడు. కేవలం 80 బంతుల్లో 15 ఫోర్లు, 15 భారీ సిక్సర్లతో ఏకంగా 175 పరుగులు చేసి ఇంగ్లండ్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. అతని ఇన్నింగ్స్‌తో భారత్ భారీ స్కోరుకు బలమైన పునాది పడింది. కెప్టెన్ ఆయుష్ మాత్రే (53) బాధ్యతాయుతమైన అర్ధశతకంతో రాణించగా, వేదాంత్ త్రివేది (32), విహాన్ మల్హోత్రా (30), వికెట్ కీపర్ అభిగ్యాన్ కుండు (40) విలువైన పరుగులు జోడించారు. చివర్లో కనిష్క్ చౌహాన్ (20 బంతుల్లో 37 నాటౌట్) మెరుపు ఇన్నింగ్స్ ఆడటంతో టీమిండియా నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 411 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. ఇంగ్లండ్ బౌలర్లలో జేమ్స్ మింటో 3 వికెట్లు తీశాడు.భారత్ గతంలో 2000, 2008, 2012, 2018, 2022లో అండర్-19 కప్ ను గెలిచింది. ఇప్పుడు రికార్డు స్థాయిలో ఆరోసారి కప్ సాధించి, అండర్-19 ప్రపంచకప్ చరిత్రలో తన తిరుగులేని ఆధిపత్యాన్ని మరోసారి నిరూపించుకుంది. మ్యాచ్ అనంతరం భారత ఆటగాళ్లు త్రివర్ణ పతాకాలను చేతబూని మైదానంలో సంబరాలు జరుపుకున్నారు.

భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) కీలక వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచింది. పాలసీ రెపో రేటును ప్రస్తుతమున్న 5.25 శాతం వద్దే కొనసాగించాలని ద్రవ్య పరపతి కమిటీ (ఎంపీసీ) ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ప్రకటించారు. దీంతో పాటు తమ 'న్యూట్రల్ మానిటరీ పాలసీ' వైఖరికే కట్టుబడి ఉన్నట్లు ఆయన స్పష్టం చేశారు.

దేశ ఆర్థిక పరిస్థితులు, భవిష్యత్ అంచనాలను జాగ్రత్తగా పరిశీలించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నట్లు గవర్నర్ తెలిపారు. గత డిసెంబర్ సమావేశం తర్వాత ప్రపంచవ్యాప్తంగా ప్రతికూలతలు పెరిగినప్పటికీ, ప్రభుత్వం కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాలు ఆర్థిక వ్యవస్థకు సానుకూలంగా ఉన్నాయని ఆయన అన్నారు. ద్రవ్యోల్బణాన్ని నియంత్రిస్తూనే, వృద్ధికి ఆటంకం కలగకుండా సమతౌల్యం పాటించడమే 'న్యూట్రల్' వైఖరి ఉద్దేశమని వివరించారు.

ద్రవ్యోల్బణం అదుపులోనే ఉందని, ఆర్బీఐ నిర్దేశించిన సహన పరిమితి కంటే తక్కువగా ఉందని మల్హోత్రా పేర్కొన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి రెండు త్రైమాసికాలకు సీపీఐ ద్రవ్యోల్బణ అంచనాలను వరుసగా 4 శాతం, 4.2 శాతానికి సవరించినట్లు తెలిపారు. భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి అంచనాలు ఆశాజనకంగా ఉన్నాయని, దేశీయ అంశాలే దీనికి కారణమని ఆయన అభిప్రాయపడ్డారు.గత డిసెంబర్‌లో జరిగిన సమీక్షలో వృద్ధిని ప్రోత్సహించేందుకు ఆర్బీఐ రెపో రేటును 5.5 శాతం నుంచి 5.25 శాతానికి (25 బేసిస్ పాయింట్లు) తగ్గించిన విషయం తెలిసిందే. అంతకుముందు ఆగస్టు, అక్టోబర్‌లలో రేట్లను స్థిరంగా ఉంచింది. ప్రస్తుతం రేట్లలో మార్పు లేనందున గృహ, వాహన రుణాలతో సహా ఇతర రుణాలపై వడ్డీ రేట్లు ఇప్పట్లో పెరిగే అవకాశం లేదు.

# స్తంభించిన పార్లమెంట్

(మొదటి పేజి తరువాయి)

లోక్‌సభ, రాజ్యసభ ఎలాంటి ముఖ్యమైన చర్చలు జరపకుండానే సోమవారం వరకు వాయిదా పడ్డాయి. అమెరికా ప్రయోజనాలకు పూర్తిగా లొంగిపోవడం, వాణిజ్య ఒప్పందాలపై సంతకం చేయడం, భారత్-చైనా ఉద్రిక్తత సమయంలో కీలకమైన నిర్ణయాలను ఆలస్యం చేయడం వంటి ఆరోపణలను మోడీ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు ప్రధానంగా చేశాయి. శుక్రవారం లోక్‌సభ ప్రారంభమైన వెంటనే, ప్రతిపక్షాలు తీవ్ర నిరసనలు తెలిపాయి. మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణే రాసిన వివాదాస్పద పుస్తకం 'ఫర్ ది స్టార్స్ ఆఫ్ డెస్టినీ' చిత్రాలతో కూడిన బ్యానర్‌లను పట్టుకుని ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేశారు. 'నియంతృత్వాన్ని అనుమతించరు', 'ప్రతిపక్షాలను మాట్లాడటానికి అనుమతించాలి', 'నరేంద్ర లొంగిపోయారు' వంటి నినాదాలు సభలో హోరెత్తాయి.దీని తరువాత, సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. సభ తిరిగి సమావేశమైనప్పుడు కూడా ప్రతిపక్షాల నిరసనలు తగ్గలేదు. పోస్టర్లు, ప్లకార్డులు, బ్యానర్ల నినాదాలు కొనసాగాయి. ప్రధాని లోక్‌సభను ఎదుర్కోవడానికి భయపడుతున్నారని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అన్నారు. ఈ సమావేశంలో 19 గంటల 13 నిమిషాలు నిరంతర నిరసనలతో సమయం వృథా అయ్యిందని స్పీకర్ ఆరోపించారు. అయితే, ప్రతిపక్షాల డిమాండ్లను ఆమోదించే వరకు బడ్జెట్ చర్చలకు తాము ఏ విధంగానూ సహకరించబోమని, తమ వైఖరిలో మార్పు లేదని ప్రతిపక్షం స్పష్టం చేసింది. అనంతరం సభను సోమవారం వరకు వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు. రాజ్యసభలో కూడా ఇలాంటి నిరసనలే జరిగాయి. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాల నిరసనలు పార్లమెంటు వెలుపలా కొనసాగాయి. 'ఎటువంటి ఒప్పందం అనుమతించబడదు' అనే బ్యానర్‌తో ప్రతిపక్ష సభ్యులు పార్లమెంట్ గేటు వద్ద నిరసన తెలియజేశారు. సస్పెండైన ఎంపీలు కూడా ఈ నిరసనలో పాల్గొన్నారు.

# తప్పులను ఎత్తి చూపితే దాడులా ?

(మొదటి పేజి తరువాయి)

మాట్లాడుతూ.. టీడీపీ నేతలు పోలీసులను వెంటబెట్టుకుని వచ్చి దాడి చేసిన వీడియో ఫుటేజ్ లు కూడా ఉన్నాయన్న ఆయన.. పోలీసుల సమక్షంలోనే నిప్పు పెట్టారు.. దాడి చేసిన టీడీపీ నేతలు మొత్తం చంద్రబాబు, లోకేష్ కి అత్యంత సన్నిహితులే అని తెలిపారు..కళ్లు మూసుకుని తెరిస్తే రెండేళ్లు గడిచాయి.. మరో మూడేళ్లు కళ్లు మూసుకుంటే వచ్చేది మన ప్రభుత్వమే..మనం నాగరిక ప్రపంచంలో ఉన్నామా..? జంగిల్ రాజ్ లో ఉన్నామా..? అనటానికి ఇదో ఉదాహరణగా పేర్కొన్నారు వైఎస్ జగన్.. జోగి రమేష్ ఆయన మీద పెట్టిన అక్రమ కేసులో విచారణకు హాజరయ్యేందుకు వెళ్లిన సమయంలో దాడి చేశారు.. లోకల్ పోలీసులతో పాటు సీపీ ఫోన్ కూడా ఎత్తలేదు.. అంబటి రాంబాబు ఇంటి దగ్గర దహనకాండ సమయంలో కూడా పోలీసులు ఇలాగే చేశారు.. పోలీసుల సమక్షంలోనే అక్కడ కూడా దాడి జరిగిందన్నారు.. జోగి రమేష్ ఇంటిపై పెట్రోల్ బాంబులు, యాసిడ్ బాటిళ్లతో దాడులు చేయడం కూటమి ప్రభుత్వం అరాచక పాలనకు నిదర్శనమంటూ మండిపడ్డారు.. గుంటూరులో అంబటి రాంబాబు.. ఇక్కడ జోగి రమేష్ ఇంటిని ధ్వంసం చేశారు. అంబటి రాంబాబు ఇంట్లోకి చొరబడ్డారు.. విధ్వంసం సృష్టించారు. అంబటి కుటుంబ సభ్యులపై దుర్భాషలాడారు. అంబటి ఆఫీస్‌ను కూడా తగలబెట్టారు. అంబటి ఇంట్లో, ఆఫీస్‌లో జరిగిన జంగిల్ రాజ్‌ను.. జోగి రమేష్ విషయంలో కూడా కొనసాగించారని ఆవేదన వ్యక్తం చేశారు.. వచ్చేది మన ప్రభుత్వమే.. జగన్ 2.0లో అందరి లెక్కలు తేలుస్తామని హెచ్చరించారు.. మాజీ మంత్రి జోగి రమేష్ ఇంటిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించిన ఆయన.. జోగి రమేష్ ఇల్లు మొత్తం చిన్నాభిన్నం అయ్యింది. స్థానిక పోలీసులు, టీడీపీ నేతలు కలిసి ప్లాన్ చేసి దాడి చేశారు. దాడి సమయంలో, పోలీసులు సమక్షంలోనే నిప్పులు పెట్టారు.జోగి రమేష్ విచారణ కోసం హాజరైన సమయంలోనే ఈ దాడి జరిగింది. స్థానిక పోలీసులు మరియు సీపీ ఫోన్ కూడా అందుకోలేదు. ఇటువంటి పరిస్థితి అంబటి రాంబాబు ఇంటి దగ్గర జరిగిన దహనకాండ సమయంలో కూడా కనిపించిందన్నారు వైఎస్ జగన్.. హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు ప్రతి సమస్యను తీసుకెళ్తాం.. జోగి రమేష్‌పై ఇప్పటి వరకు 12 అక్రమ కేసులు నమోదయ్యాయి. కల్తీ మద్యం కేసులో ఆయనను జైల్లో కూడా పెట్టారు. వైఎస్ జగన్ చెప్పినట్లే, పోలీసులు మరియు వర్గాల సహకారంతో ఆయనపై రాజకీయ భయం, న్యాయ హరాస్మెంట్ కొనసాగుతోంది. మేం అధికారంలోకి వచ్చిన తర్వాత అసలు దోషులను బోన్‌లో నిలబెడతామని హెచ్చరించారు వైఎస్ జగన్..

# టీం 11... కల్తీకి, హత్యలకు బ్రాండ్ అంబాసిడర్లు

(మొదటి పేజి తరువాయి)

ఈ దుష్ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొట్టాలని ఆయన పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన బూత్ మేనేజ్‌మెంట్ వర్క్‌షాప్‌లో లోకేశ్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "పార్టీ సొంతిల్లు, ప్రభుత్వం కిరాయి ఇల్లు అనే విషయాన్ని జీవితాంతం గుర్తుంచుకోవాలి. నాయకులు ఎంత ఎదిగినా, ఎన్ని ఇబ్బందులు వచ్చినా చివరకు మన దేవాలయం లాంటి టీడీపీ ఆఫీసుకే వస్తారు. పార్టీని బలోపేతం చేసేందుకు మనం అహర్నిశలు కష్టపడాలి" అని చంద్రబాబు చెప్పిన మాటలను గుర్తుచేశారు."గ్రామస్థాయి నుంచి కాదు, బూత్ స్థాయి నుంచి పార్టీని పునర్నిర్మాణం చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టాం. బూత్ స్థాయిలో బలంగా ఉంటేనే టీడీపీ బలంగా ఉంటుంది" అని లోకేశ్ స్పష్టం చేశారు. 2019 ఎన్నికల తర్వాత కొన్ని బూత్‌లలో వేవ్ ఉన్నా ఎందుకు గెలవలేకపోయామనే కారణాలను అన్వేషించాలన్నారు. తన అనుభవాన్ని వివరిస్తూ, "1985 తర్వాత మంగళగిరిలో టీడీపీ జెండా ఎగరలేదు. 2019లో 5,300 ఓట్ల తేడాతో ఓడిపోయినప్పుడు కలిగిన బాధ, ఆవేదన నాలో కసి పెంచింది. ఓడిన చోటే గెలవాలని కార్యకర్తలతో కలిసి బూత్‌ల వారీగా సమీక్షించి, నాలుగేళ్లు తూచా తప్పకుండా పనిచేసి విజయం సాధించాం" అని తెలిపారు. సంస్థాగత నిర్మాణంపై నమ్మకంతోనే గెలిచానని, ఇప్పుడు అదే స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.ఐదు జోన్లలో 4,772 బూత్‌లను బలోపేతం చేసేందుకు 903 మంది సీనియర్ నాయకులను నియమించినట్లు లోకేశ్ వెల్లడించారు. "ప్రతి నాయకుడు బూత్‌కు కనీసం ఒక రోజు కేటాయించి, అక్కడి పరిస్థితులను తెలుసుకుని, పార్టీ బలోపేతానికి నివేదిక ఇవ్వాలి. ఇకపై బూత్ పనితీరు ఆధారంగానే రాజకీయ భవిష్యత్తు ఉంటుంది. కష్టపడి పనిచేసిన వారికే పార్టీలో పదవులు దక్కుతాయి," అని ఆయన స్పష్టం చేశారు. పసుపు జెండా కోసం ప్రాణాలు త్యాగం చేసిన అంజిరెడ్డి తాత, మంజుల, చెన్నుపాటి గాంధీ, తోట చంద్రయ్య వంటి కార్యకర్తలే తనకు స్ఫూర్తి అని అన్నారు."దేశానికి వస్తున్న పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే వస్తున్నాయి. విశాఖ ఉక్కును లాభాల్లోకి తీసుకువచ్చిన ఘనత డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్‌ది. విశాఖ రైల్వే జోన్ సాధించుకున్నాం. అమరావతి, పోలవరం పనులు వేగవంతం చేశాం. కర్నూలులో త్వరలోనే హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తాం," అని లోకేశ్ తెలిపారు. రూ.4 వేల పింఛను, తల్లికి వందనం, అన్న క్యాంటీన్ల పునఃప్రారంభం, 16 వేల టీచర్ పోస్టుల భర్తీ వంటి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు."రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వ కొనసాగింపు చాలా అవసరం. కనీసం 15 ఏళ్లు కలిసికట్టుగా ముందుకు వెళితేనే అభివృద్ధి సాధ్యమని పవనన్న చెప్పారు. మన కూటమిలో విడాకులు, మిస్ ఫైర్‌లు, క్రాస్ ఫైర్‌లు ఉండవు. ఏవైనా సమస్యలుంటే మూడు పార్టీలు కూర్చొని చర్చించుకుంటాయి. వైసీపీ మన మధ్య విభేదాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తుంది, అందరూ అప్రమత్తంగా ఉండాలి" అని లోకేశ్ హితవు పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

# మనకెందుకులే అనుకోవద్దు...

## ప్రతి భక్తుడిపై ధార్మిక బాధ్యత ఉంటుంది: పవన్ కల్యాణ్



ప్రతి భక్తుడిపై ధార్మిక బాధ్యత ఉంటుందని, హిందూ దేవుళ్లను, ధర్మాన్ని కించపరిచినప్పుడు మౌనంగా ఉండకుండా తమ గళాన్ని వినిపించాలని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. సగటు హిందువు మనస్తత్వంలో మార్పు రావాలని, భయంతో లేదా సౌలభ్యం కోసం మౌనంగా ఉండే ధోరణిని వీడాలని ఆయన సూచించారు. దేవుడిపై భయం, విశ్వాసంపై గౌరవం ఉన్నప్పటికీ, మన ధర్మాన్ని ఎవరైనా దురుద్దేశంతో అపహాస్యం చేసినప్పుడు కేవలం వ్యక్తిగతంగా బాధపడి, కర్మకు వదిలేసి ముందుకు సాగే అలవాటు మారాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.పవన్ కల్యాణ్ తన అభిప్రాయాలను వివరిస్తూ, "మనం కులం, మతం, ప్రాంతం, భాషల పరంగా విభజనకు గురై ఉండవచ్చు. కానీ మనందరి ధర్మం ఒక్కటే, దేవుళ్లు కూడా అంతే. మన విశ్వాసాలను, ధర్మాన్ని ఉద్దేశపూర్వకంగా అవమానించినప్పుడు మన బాధను తెలియజేయడం మనందరి కర్తవ్యం. ఇలాంటి కీలక సమయాల్లో పాటించే మౌనం సమిష్టి చైతన్యాన్ని బలహీనపరుస్తుంది" అని పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరూ కేవలం భక్తులుగా మిగిలిపోకుండా, తమ విశ్వాసాలకు స్పృహతో కూడిన సంరక్షకులుగా కూడా వ్యవహరించాలని ఆయన కోరారు.

హిందూ ధర్మాన్ని రక్షించుకోవడమంటే ఇతర మతాలకు వ్యతిరేకంగా ఉండటం కాదని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. తమ సొంత విశ్వాసాలను, సంప్రదాయాలను కాపాడుకోవడం మాత్రమేనని ఆయన వివరించారు. హిందువులు తమ ధార్మిక బాధ్యతను గుర్తించి, సోమరితనం వీడి, తమ విశ్వాసాల పరిరక్షణకు సమిష్టిగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మార్పు ద్వారానే హిందూ ధర్మం యొక్క గౌరవాన్ని కాపాడుకోగలమని ఆయన ట్వీట్ చేశారు.

# స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల కోసం సిరిసిల్ల పట్టణ కేంద్రంలో ఫ్లాగ్ మార్చ్

**- ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అన్ని వర్గాల ప్రజలు పోలీసులకు సహకరించాలి**








**రాజన్న సిరిసిల్ల జిల్లా ఫిబ్రవరి 6 ప్రజా దివాస్** ప్రతి ఒక్కరు ఎన్నికల ప్రవర్తన నియమావళి పాటించాలి, ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవు.మున్సిపల్ ఎన్నికలకు పటిష్ట పోలీస్ బందోబస్త్ ఏర్పాటుజిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఐపీఎస్., గారు.మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ఈరోజు సిరిసిల్ల పట్టణ కేంద్రంలో జిల్లా పోలీస్ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడం జరిగింది.ఈసందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ.. ....ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించడానికి ఫ్లాగ్ మార్చ్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు.ఎన్నికల కమిషన్ సూచించిన మార్గదర్శకాల ప్రకారం స్వేచ్ఛాయుతగా ప్రజలు ఓటు హక్కును వినియోగించుకునే విధంగా ఎన్నికలు నిర్వహిస్తామన్నారు.ప్రతి ఒక్కరు ఎన్నికల ప్రవర్తన నియమావళి తప్పక పాటించాలని,ఎన్నికల నియమావళి ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.సిరిసిల్ల,వేములవాడ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పటిష్ట పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేయడం జరుగుతుందని,ఎవరైనా చట్ట విరుద్ధంగా ప్రవర్తించిన,గొడవలు సృష్టించాలని చూసిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని,ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే విధంగా అక్రమ మద్యం, డబ్బు, ఇతర వస్తువులు రవాణా చేస్తే పోలీస్ వారికి సమాచారం అందించాలన్నారు.ఫ్లాగ్ మార్చ్ లో సిరిసిల్ల డిఎస్పీ నాగేంద్రచారి, ఇన్స్పెక్టర్ లు కృష్ణ, శ్రీనివాస్, ఆర్.ఐ సురేష్, ఎస్.ఐ లు శ్రీకాంత్,ఉపేంద్రచారి,రాజు,దిలీప్, రాహుల్ రెడ్డి, లక్ష్మణ్, వీనితా రెడ్డి, జునైద్,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు చేయాలి

**- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**



**రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి – 06 ప్రజా దివాస్**ఈ నెల 25వ తేదీ నుంచి వచ్చే నెల (మార్చి) 16వ తేదీ వరకు ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణ కోసం ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సంబంధిత అధికారులను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఛాంబర్ లో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, అదనపు ఎస్పీ చంద్రయ్యతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశం ఇంచార్జి కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ఇంటర్ ఫస్ట్ ఇయర్ నుంచి 4046 మంది, సెకండ్ ఇయర్ నుంచి4060 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు.పరీక్షలు ఉదయం 09.00 గంటల నుంచి 12.00 గంటల వరకు నిర్వహిస్తారని వెల్లడించారు. విద్యార్థుల హాల్ టికెట్లు సిద్ధం అవుతున్నాయని వివరించారు. ప్రశ్నపత్రాలను పరీక్షా కేంద్రాలకు తరలించే సమయంలో పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. గుర్తింపు పొందిన వారిని తప్ప ఎవరినీ అనుమతించరాదని ఆదేశించారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు.వేసవి దృష్ట్యా వైద్య శాఖ అధికారులు పరీక్షా కేంద్రాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ లను నియమించాలని అధికారులను ఆదేశించారు. మహిళా పోలీస్ సిబ్బందికి డ్యూటీ కేటాయించాలని సూచించారు. కేంద్రాల్లో పరీక్ష రాసే వారికి అన్ని వసతులు కల్పించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శరత్ కుమార్, కలెక్టరేట్ పర్యవేక్షకులు వేణు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి

**- ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్**

**- మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో వేములవాడలో జోనల్ ఆఫీసర్స్, ఆర్ఓలు, ఏఆర్ఓలు, పీఓలు, ఏపీఓలకు శిక్షణ**



**వేములవాడ, ఫిబ్రవరి – 6 ప్రజా దివాస్** రాష్ట్ర ఎన్నికల సంఘం నియమావళికి అనుగుణంగాఅధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ సూచించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో వేములవాడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జోనల్ ఆఫీసర్స్, ఆర్ఓలు, ఏఆర్ఓలు, పీఓలు, ఏపీఓలకు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించగా, ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ హాజరై మాట్లాడారు. ఎన్నికల నియమ, నిబంధనల స్పష్టమైన అవగాహన ఉండాలని, ఎస్ఈసీ కరదీపిక వెంట ఉండాలని సూచించారు. ఎస్ఈసీ మార్గదర్శకాల మేరకు సజావుగా ఎన్నికలు జరిగేలా కృషి చేయాలని వివరించారు. వేములవాడ మున్సిపల్ ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎన్నికల అధికారులు, సిబ్బంది ఎన్నికల సామగ్రితో వారికి కేటాయించిన వాహనాల్లోనే వెళ్లాలని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రంలో ఎన్నికల రోజున అన్ని ఏర్పాట్లను సరి చూసుకోవాలని సూచించారు. ఓటర్లు 18 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి తీసుకువెళ్ళి ఓటు హక్కు వినియోగించుకోవచ్చని వెల్లడించారు. పోలింగ్ కేంద్రంలోకి మొబైల్ ఫోన్ అనుమతి లేదని స్పష్టం చేశారు. బ్యాలెట్ పేపర్ అకౌంట్, బ్యాలెట్ బాక్స్ లు చెక్ చేసుకొని తీసుకువెళ్లాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రం వద్ద 100 మీటర్ల పరిధి వరకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉంటుందని స్పష్టం చేశారు.గుర్తింపు కార్డు ఉన్న పోలింగ్ ఏజెంట్స్, ఎన్నికల అధికారులు మినహా ఎవరికీ అనుమతి లేదని తెలిపారు. పోలింగ్ ముగిసిన తర్వాత సామగ్రి అంతా వేములవాడలోని సినారే కళామందిర్ లో ఏర్పాటు చేసిన రిసెప్షన్ కేంద్రానికి తరలించి అప్పగించాలని వివరించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలని పిలుపు నిచ్చారు. ఈ నెల 7, 8 తేదీల్లో సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కార్యాలయాల్లో ఫెసిలిటేషన్ కేంద్రాలు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. ఓటు హక్కు వినియోగించు కోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో అధికారులు, సిబ్బందికి కనీస వసతులు, భోజనం ఇతర సదుపాయాలు కల్పించాలని మున్సిపల్ అధికారులను ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ ఆదేశించారు.శిక్షణ కార్యక్రమంలో ఆర్డీఓ రాధాబాయి, ట్రైనింగ్ నోడల్ అధికారి శ్రీనివాసాచారి, జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, తహసీల్దార్ జయంత్ కుమార్ తదితరులు ఉన్నారు.



# రగుడు వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే.






**రాజన్న సిరిసిల్ల జిల్లా ఫిబ్రవరి 6 ప్రజా దివాస్** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో రగుడు వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ ను జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే శుక్రవారం రోజున తనిఖీ చేసి వాహన తనిఖీల రిజిస్టర్లు పరిశీలించరు.చెస్ పోస్ట్ వద్ద విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి వివరాలను నమోదు చేయాలన్నారు.పోలింగ్ పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉంటూ ఓటర్లను ప్రలోభ పెట్టే విధంగా జరిగే నగదు,మద్యం వంటి అక్రమ రవాణాను అరికట్టాలని సూచించారు.ప్రజలందరూ తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునేలా పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్పీ గారు తెలిపారు.

# అక్రిడిటేషన్ కార్డుల జారీకి ఆన్లైన్ దరఖాస్తులు ఆహ్వానం

**ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**ఈ నెల 9 నుంచి ఆన్లైన్ లో దరఖాస్తులు సమర్పించాలి**



**రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి -06: ప్రజా దివాస్** సమాచార పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో 2026--28 సంవత్సరానికి జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల జారీ కోసం ఆన్లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా అక్రెడిటేషన్ కమిటీ చైర్ పర్సన్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఒక ప్రకటనలో తెలిపారు.ప్రస్తుతం అమల్లో ఉన్న అక్రిడిటేషన్ కార్డుల కాలపరిమితి గడువు ఈ నెల 28వ తేదీతో ముగియనున్నందున అర్హత కలిగిన జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు తెలిపారు.జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కార్డుల కోసం మీడియా యాజమాన్యాలు తమ జర్నలిస్టుల పేర్ల జాబితాను జిల్లా పౌరసంబంధాల అధికారికి సమర్పించాలని సూచించారు.యాజమాన్యాల ద్వారా పంపిన పేర్లలో ఉన్న జర్నలిస్టులు సమాచార పౌరసంబంధాల శాఖ అధికారిక వెబ్ సైట్http://ipr.telangana.gov.in ద్వారా ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.జిల్లా స్థాయిలలో ఆన్ లైన్ దరఖాస్తులను ఈ నెల 9వ తేదీ నుంచి సమర్పించాలని తెలిపారు. అర్హులైన జర్నలిస్టులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

# స్వేచ్ఛగా ఓటింగ్ లో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం

**ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్**





**రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి -06 ప్రజా దివాస్** స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఓటింగ్ జరగడంలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమని జిల్లా ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు. మైక్రో అబ్జర్వర్ల శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం జిల్లా సమీకృత కార్యాలయా ల సముదాయంలో నిర్వహించగా, ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్, ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి తో కలిసి హాజరై మాట్లాడారు. మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ కు ముందురోజు, పోలింగ్ రోజు పోలింగ్ కేంద్రాన్ని నిశితంగా పరిశీలించాలని, ఎన్నికలు జరి గిన తీరును పర్యవేక్షించి, అట్టి నివేదికను ఎన్నికల సాధారణ పరిశీలకులకు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు.మైక్రో అబ్జర్వర్లకు కేటాయించిన పోలింగ్ కేంద్రంలోని పోలింగ్ సరళినీ, ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలిం చాలని, వారి విధులను పటిష్టంగా నిర్వహిస్తునే పోలింగ్ టీంలతో స్నేహపూ ర్వకంగా వ్యవహరించాలని సూచించారు. పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగుతోందా లేదా, ఎక్కడైనా ఏమైనా సమస్యలు ఉన్నాయా, ఎన్నికల నియమావళి అమలు, తదితర విషయాలను సూక్ష్మంగా పరిశీలించాలని ఆదేశించారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే సాధారణ పరిశీలకుల దృష్టికి వెంటనే తీసుకురావాలని సూచించారు.సమావేశంలో నోడల్ అధికారి మల్లిఖార్జున రావు, ట్రైనర్ మహేందర్ రెడ్డి, మైక్రో అబ్జర్వర్లు పాల్గొన్నారు.

# భక్తులకు సాఫీగా దర్శనం అయ్యేలా ఏర్పాట్లు చేయాలి

**- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**- వేములవాడలో శివరాత్రికి చేస్తున్న ఏర్పాట్ల పరిశీలన**





**వేములవాడ, ఫిబ్రవరి -06 ప్రజా దివాస్**

మహా శివరాత్రి జాతర సందర్భంగా భక్తులకు సాఫీగా దర్శనం అయ్యేలా ఏర్పాట్లు చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. మహా శివరాత్రి జాతర సందర్భంగా వేములవాడ శ్రీ భీమేశ్వరస్వామి ఆలయంలో చేస్తున్న ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ శుక్రవారం పరిశీలించారు. ముందుగా వీఐపీ దర్శనాల కోసం చేసిన ప్రత్యేక ద్వారం, బారికేడింగ్ ను పరిశీలించి శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయ ఈఈ రాజేష్ కు సూచనలు చేశారు. క్యూ లైన్లు పరిశీలించి, నీటి సదుపాయం ఏర్పాట్లను సందర్శించి ఎక్కువ చోట్ల తాగునీటి పాయింట్లు పెట్టి భక్తులకు అందించాలని సూచించారు. అక్కడి నుంచి నూతన బద్ది పోచమ్మ ఆలయ నిర్మాణ వద్ద ఉన్న ఖాళీ స్థలంలో స్వామివారి ప్రసాదం కౌంటర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కళ్యాణకట్టను పరిశీలించి.. పలు సూచనలు చేశారు. మొబైల్ టాయిలెట్ల సంఖ్య మరింత పెంచాలని ఆదేశించారు.జాతర వైభవంగా నిర్వహించాలిమహా శివరాత్రి సందర్భంగా స్వామి వారి ఆలయాన్ని పూల అలంకరణతో అందంగా ముస్తాబు చేసి.. జాతరను వైభవంగా నిర్వహించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. పార్కింగ్ స్థలం వద్ద కోడెల టికెట్ కౌంటర్, పందిర్లు, శివార్చన స్టేజీ పరిశీలించారు. మహా శివరాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రణాళిక ప్రకారం ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు. పరిశీలనలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆర్డీఓ రాధాభాయి, ఆలయ ఈఈ రాజేష్, డీఈ రఘునందన్, తహసీల్దార్ జయంత్ కుమార్, మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్ తదితరులు ఉన్నారు.

# మొబైల్ రికవరీలో రాజన్న సిరిసిల్ల జిల్లాకు జాతీయ కీర్తి

**సాంకేతికతతో గుర్తింపు... సేవతో పరిష్కారం**

**తో విశిష్ట విజయం సాధించిన జిల్లా పోలీసులు.**

**78% మొబైల్ రికవరీ రేటుతో దక్షిణాది రాష్ట్రాలలో మొదటి స్థానం.**

**జిల్లా పోలీసుల పనితీరును ప్రశంసించిన రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి ఐపీఎస్.**



**రాజన్న సిరిసిల్ల జిల్లా ఫిబ్రవరి 6 ప్రజా దివాస్**

రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీసులు మొబైల్ ఫోన్ రికవరీలో దేశవ్యాప్తంగా గుర్తింపు సాధించి విశిష్ట ఘనతను తమ ఖాతాలో వేసుకున్నారు. CEIR (Central Equipment Identity Register) వ్యవస్థను సమర్థవంతంగా వినియోగిస్తూ 78 శాతం మొబైల్ రికవరీ రేటు సాధించి, దక్షిణాది రాష్ట్రాలలో ప్రథమ స్థానంలో నిలవడం జిల్లా పోలీస్ యంత్రాంగం గర్వకారణమైన విజయం సాధించారు.జిల్లాలో వివిధ సందర్భాల్లో పోగొట్టుకున్న లేదా దొంగిలించబడిన మొబైల్ ఫోన్లపై వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరిస్తూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, డిజిటల్ ట్రాకింగ్ విధానాలు, అప్లికేషన్‌ను సమర్థంగా ఉపయోగించడం ద్వారా ఇప్పటివరకు మొత్తం 2,286 మొబైల్ ఫోన్లను బాధితులకు తిరిగి అందజేస్తూ 78 శాతం రికవరీ రేటు సాధించడం విశేషం. ఈ అద్భుతమైన పనితీరుతో దక్షిణాది రాష్ట్రాలన్నింటిలో రాజన్న సిరిసిల్ల జిల్లా మొదటి స్థానాన్ని సాధించిం ది.ఈ సందర్భంగా రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి ఐపీఎస్., గారు జిల్లా పోలీస్ అధికారులను అభినందిస్తూ ప్రశంసలు కురిపించి, హర్షం వ్యక్తం చేశారు. మొబైల్ రికవరీలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చినందుకు భారత ప్రభుత్వ టెలికమ్యూనికేషన్స్ శాఖ (Department of elecommunications), న్యూ ఢిల్లీ ఆధ్వర్యంలో సౌత్ ఇండియా లెవెల్‌లో మొదటి స్థానం జిల్లా పోలీసులకు దక్కడం గర్వకారణం అని పేర్కొన్నారు. ఈ నెల 12వ తేదీన కేరళ లోని ఎర్నాకులంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి సదస్సుకు జిల్లా ఎస్పీ మహేష్ బి గీతే గారు హాజరై, CEIR ద్వారా మొబైల్ ఫోన్ రికవరీలో అనుసరించిన ఉత్తమ విధానాలు, కార్యాచరణ వ్యూహాలు, విజయవంతమైన అనుభవాలను కాన్ఫరెన్స్‌లో వివరించి అవార్డును స్వీకరించనున్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ,మొబైల్ ఫోన్ రికవరీలో ఆల్ ఇండియా స్థాయిలో గుర్తింపు రావడం, దక్షిణాది రాష్ట్రాలలో మొదటి స్థానం సాధించడం తెలంగాణ పోలీసుల పనితీరు, నిబద్ధతకు నిదర్శనం అని పేర్కొన్నారు. ఫిర్యాదులు అందిన వెంటనే బాధ్యతాయుతంగా, తక్షణ స్పందనతో వ్యవహరించడం, వంటి ఆధునిక డిజిటల్ వ్యవస్థలను పూర్తి స్థాయిలో వినియోగించడం, సాంకేతిక నైపుణ్యంతో ట్రాకింగ్ నిర్వహించడం వల్లే ఈ స్థాయి ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత విస్తృతంగా వినియోగిస్తూ, ప్రజల నమ్మకాన్ని బలపరచే విధంగా పోలీస్ శాఖ ముందుకు సాగుతుందని ఎస్పీ తెలిపారు.

# కాంగ్రెస్ మోసానికి మున్సిపల్ ఎన్నికల్లో బుద్ధి చెప్పండి

## బి ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**రాజన్న సిరిసిల్ల జిల్లా ఫిబ్రవరి 6 ప్రజా దివాస్**మున్సిపల్ ఎన్నికల్లో బిజెపికి ఓటు వేయడం అంటే మోరిలో వేసినట్లేచేయి గుర్తుకు ఓటు వేయడం అంటే వారి మోసానికి హామీల వైఫల్యానికి ఓటు వేసినట్లే 11వ తేదీన కారు గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ కి బుద్ధి చెప్పండి వేములవాడ సిరిసిల్లలో కేటీఆర్ ఎన్నికల ప్రచారంమున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయడం అంటే వారి ప్రజా వ్యతిరేక విధానాలకు, ఆరు గ్యారంటీల అమలులో వైఫల్యానికి, మరియు వారు చేసిన 420 వాగ్దానాల మోసానికి మద్దతు ఇవ్వడమేనని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ తన మొండి వైఖరిని వీడాలంటే, ప్రజలందరూ కారు గుర్తుకు ఓటు వేసి ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ ప్రచారంలో భాగంగా వేములవాడ మరియు సిరిసిల్ల ప్రాంతాల్లో పర్యటించిన కేటీఆర్, ఈ నెల 11న జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీని ఇప్పుడే అడ్డుకోకపోతే, ఆ పార్టీ మరింత రెచ్చిపోయి ప్రజలను పీడిస్తుందని హెచ్చరించారు. ఇప్పటికే అవినీతి, అక్రమాలు మరియు స్కాములతో ఆ పార్టీ ప్రతిష్ట మసకబారిందని ఆయన విమర్శించారు. అదేవిధంగా, భారతీయ జనతా పార్టీపై కూడా ఆయన మండిపడుతూ, బీజేపీకి ఓటు వేయడం అంటే అది వృథా చేయడమేనని, మీ ఓటు మోరిలో వేసినట్లే అన్నారు. ఆ పార్టీ కేవలం ఎన్నికల సమయంలోనే కనిపిస్తుందని ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు కులమతాల పేరుతో ఓట్లు వేయించుకొని, ఒట్టు పెట్టించుకుని పదవులు పొంది మాయమవుతుందన్నారు.కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై విమర్శలు చేస్తూ, ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు లేదా తెలంగాణ రాష్ట్రానికి ఆయన సాధించిందేమీ లేదని కేటీఆర్ అన్నారు. గత 12 ఏళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు ఒక్క రూపాయి కూడా అదనంగా ఇవ్వలేదని, సిరిసిల్ల నేతన్నలు ఎంతో కాలంగా కోరుతున్న మెగా పవర్ లూమ్ క్లస్టర్‌ను తీసుకువచ్చే శక్తి ఆ పార్టీకి లేదని విమర్శించారు. బీజేపీ కేవలం కులమత రాజకీయాలకే పరిమితమైందని ఆయన ఆరోపించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సమాజంలోని అన్ని వర్గాలను మోసం చేస్తోందని కేటీఆర్ పేర్కొన్నారు. మహిళలకు ఇస్తామన్న నెలకు 2500 రూపాయలు మరియు 400 రూపాయల పెన్షన్ వంటి హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. సిరిసిల్లలో బతుకమ్మ చీరల తయారీని రద్దు చేసి నేతన్నల ఉపాధిని దెబ్బతీశారని, నేతన్నలను అవమానపరిచేలా మాట్లాడిన కాంగ్రెస్ నేతలకు ఈ ఎన్నికల్లో తగిన సమాధానం చెప్పాలని ప్రజలను కోరారు. నేతన్నల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వారిని కండోమ్స్ అమ్ముకోండి...పాపడాలు అమ్ముకోండి అంటూ నీచమైన మాటలు మాట్లాడిన కాంగ్రెస్ నేతలకు చెప్పుతో కొట్టినట్లు ఎన్నికల్లో సమాధానం చెప్పాలన్నారు. చివరగా, సిరిసిల్ల జిల్లాను రద్దు చేస్తానని రేవంత్ రెడ్డి బెదిరిస్తున్నారని, కాంగ్రెస్‌కు ఓటు వేస్తే జిల్లా ఉనికికే ప్రమాదమని కేటీఆర్ హెచ్చరించారు. మైనార్టీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు బడ్జెట్‌లో భారీ కేటాయింపులు చేస్తామని చెప్పి ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ ఇచ్చే కొద్దిపాటి డబ్బులకు లోబడకుండా, మన సొంత పార్టీ అయిన భారత రాష్ట్ర సమితిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



# కాంగ్రెస్ బిజెపిలు తెలంగాణకు చేసింది ఏమీ లేదు

**- హామీల అమలు పరిపాలన వైఫల్యాలతో తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ మోసం చేస్తున్నది**







**రాజన్న సిరిసిల్ల జిల్లా ఫిబ్రవరి 6 ప్రజా దివాస్**

మరోవైపు కుల మతాల పేరుతో ఓట్లు అడుగుతూ బిజెపి ఎన్నికల అప్పుడు ఓట్లు వేయించుకుంటుంది అందుకే ఈ రెండు పార్టీలకు మున్సిపల్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ కి ఓటు వేసి కేసీఆర్ ని మరోసారి సీఎం చేసుకునే ప్రస్థానాన్ని ప్రారంభించాలి ఆరు గ్యారెంటీలు, కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు కావాలంటే ఆ పార్టీని ఓడించండి వేములవాడలో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈరోజు వేములవాడ నియోజకవర్గం, వేములవాడ పట్టణంలో మున్సిపల్ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం, బీజేపీ కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు చేస్తున్న అన్యాయాల పైన విరుచుకు పడ్డారు. కాంగ్రెస్ పార్టీ దొంగ మాటలతో అధికారంలోకి వచ్చి అడ్డగోలు హామీలు చెప్పి పదవి ఎక్కిన తర్వాత ప్రజల్ని మోసం చేస్తున్నదన్నారు .వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఎన్నికల సందర్భంగా బాండ్ పేపర్ మీద రాసి ఇచ్చి ఆరు గ్యారెంటీలు అన్నింటిని వంద రోజుల్లో అమలు చేస్తానని చెప్పిన విషయాన్ని ఆ సందర్భంగా ఆది శ్రీనివాస్ ఇచ్చిన బాండ్ పేపర్ ని ప్రజల ముందు చూపిస్తూ కేటీఆర్ మాట్లాడారు. ఈసారి తనకు ఓటు వేయకుంటే చనిపోతానని నాలుగు సార్లు ఓడిపోయినా అని చెప్పి సానుభూతి డైలాగులతో ఆరోజు ప్రజలను మభ్యపెట్టిన ఆది శ్రీనివాస్ ఆ తర్వాత హామీల అమలు నుంచి మొదలుకొని అభివృద్ధి వరకు అడ్రస్ లేకుండాారిపోయాడన్నారు .మరోవైపు కేవలం మంత్రి పదవి కావాలన్న ఉద్దేశంతో రేవంత్ రెడ్డి కాళ్లు పట్టుకుంటున్న ఆది శ్రీనివాస్ వేములవాడ నియోజకవర్గానికి ఏమి చేశారో చెప్పాలి అన్నారు. ఇస్తామన్న ఆరు గ్యారెంటీలలో కనీసం ఒక్కదాన్నైనా అమలు చేశారా అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కేటీఆర్ ప్రశ్నించారు. ఒకవేళ ఇన్ని రకాల మోసాల తర్వాత, ద్రోహాల తర్వాత కూడా ఈ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే ప్రజలకు మేము చేస్తున్నదే సరైంది అని... ప్రజలు కాంగ్రెస్ కి అనుకూలంగా తీర్పు ఇస్తున్నారని రేవంత్ రెడ్డి మరియు కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తున్నదని, హామీల అమలు పైన భవిష్యత్తులోనూ దృష్టి పెట్టే అవకాశమే ఉండదని కేటీఆర్ హెచ్చరించారు. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిన హామీలు ముఖ్యంగా నాలుగు వేల పెన్షన్, ఆసరా పెన్షన్ నుంచి మొదలుకొని రైతు భరోసా, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ , తులం బంగారం రావాలన్నా ఖచ్చితంగా ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేయాలని, అప్పుడే తాము చేస్తున్న మోసాల పైన ప్రజలు కోపంగా ఆగ్రహంగా ఉన్నారన్న విషయాన్ని తెలుసుకుంటుంది అన్నారు.మరోవైపు ఇదే పార్లమెంట్ నియోజకవర్గం నుంచి రెండు సార్లు ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కూడా చేసింది ఏమీ లేదని తెలంగాణకు కేంద్రంలోని బీజేపీ ఎలాంటి లబ్ధి చేయలేదన్నారు. పదిహేను లక్షలు ప్రతి ఇంటికి ఇస్తానని చెప్పిన మోదీ ఆ తర్వాత ఇచ్చిన హామీలన్నింటినీ పక్కన పెట్టారని కేటీఆర్ ఆరోపించారు. ప్రతిసారి ఎన్నికలు రాగానే దేవుడి పేరు చెప్పి కులం, మతం పేరు చెప్పి బీజేపీ ఓట్లు ప్రజలతో వేయించుకుంటుందని కేటీఆర్ విమర్శించారు.ఈసారి కూడా బీజేపీ దొంగ మాటలకు మోసపోవద్దని కేవలం పేదోళ్ల కడుపులు నింపి తండ్రి లెక్క చూసుకొని తెలంగాణ తెచ్చిన వారెవరో గుర్తుంచుకొని బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాలన్నారు. ఈ ఎన్నికల్లో ఈ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి కర్రు కాల్చి వాత పెడితేనే కాంగ్రెస్ ప్రభుత్వం ఒకటో అర ఆరు గ్యారెంటీలు అమలు పైన దృష్టి సారిస్తుంది అన్నారు.ఈ మున్సిపల్ ఎన్నికల్లో వేసే ఓటుతో మరోసారి కేసీఆర్ గారిని తిరిగి ముఖ్యమంత్రిని చేసుకునే ప్రస్థానం ప్రారంభం కావాలని కేటీఆర్ అన్నారు. వేములవాడలో జరిగిన ఈ ప్రచార కార్యక్రమంలో కేటీఆర్ తో పాటు స్థానికంగా మున్సిపాలిటీకి పోటీ చేస్తున్న అభ్యర్థులతో పాటు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు ఉన్నారు.